పార్కుల అభివృద్ధికి కృషి



సీతకాలనీలో పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని సీతకాలనీ పార్కులో రూ.6లక్షల వ్యయంతో మరమ్మతులు చేపట్టారు. పనులు పూర్తి కావడంతో మంగళవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పార్కుల్లో ఆహ్లాదకర వాతావరణం పెంపొందించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో అనేక పార్కుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బి.వెంకట్‌రెడ్డి, గెల్వయ్య, శ్రీరాములు ముదిరాజ్, చందు, రమేశ్‌నాయక్, మిర్యాల రవీందర్, కాలనీ ప్రతినిధులు వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నాగభూషణంకు సత్కారం

అంబర్‌పేట: అంబర్‌పేట డివిజన్‌లో బీజేపీ పటిష్టతకు డివిజన్ మాజీ అధ్యక్షుడు నాగభూషణం చారి చేసిన కృషి అభినందనీయమని పార్టీ నేతలు అన్నారు. మంగళవారం నూతన అధ్యక్షుడు నరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరై భూషణ్‌చారిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, నాయకులు యశ్వంత్, నవీన్‌రెడ్డి, భిక్షపతి, దయాకర్‌యాదవ్, కృష్ణముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్‌లోని భరణి ఆయిల్ డిపో రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ విషయాన్ని స్థానికులు కార్పొరేటర్ కె.రవిచారి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన అధికారులతో మాట్లాడి మరమ్మతులు చేయాలని సూచించారు. ఈ మేరకు మంగళవారం అధికారులు మరమ్మతు పనులను చేపట్టారు. ఈ పనులను కార్పొరేటర్ పరిశీలించారు.

ఫోర్‌వాల్ పనుల పరిశీలన

కాచిగూడ: విక్రమ్‌నగర్ బస్తీలో కొన్ని రోజులుగా తాగునీటి సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతోంది. బస్తీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫోర్‌వాల్ (కంట్రోలింగ్ వాల్) పనులను మంగళవారం జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ ఉమారాణి మంగళవారం పరిశీలించారు. తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు. కార్యక్రమంలో జలమండలి ఏఈ భావన, బీజేపీ నేతలు రమేష్‌యాదవ్, బల్వీర్, శిర్‌సాగర్, భీమ్‌రాజ్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

త్రినాథరావుకు గానసుధ సాగర పురస్కారం

చిక్కడపల్లి: ప్రముఖ గాయకుడు, ఎస్బీఐ విశ్రాంత అధికారి సీహెచ్ త్రినాథరావుకు గానసుధ సాగర పురస్కారం దక్కింది. సంక్రాంతిని పురస్కరించుకొని ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయ్‌పూర్‌లో ఆంధ్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పురస్కారాన్ని అందుకున్నట్లు త్రినాథరావు తెలిపారు. మంగళవారం రాత్రి చిక్కడపల్లిలో ఆయన మాట్లాడుతూ... సంగీతరంగానికి అందించిన సేవలను గుర్తించి పురస్కారాన్ని ప్రదానం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకులు శ్రీనివాస్‌పట్నాయక్, అనూరాధ పణిగ్రహి, నటరాజ్‌భట్, డాక్టర్ అదినారాయణ, జి.స్వామి, ఆచార్యులు, కె.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మెగా హెల్త్ క్యాంప్

ముషీరాబాద్: విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, హెల్త్ క్లబ్, లయన్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్‌కు ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపల్ డా. ప్రభు, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డా. కోటేశ్వర్‌రావు, ప్రోగ్రామింగ్ కో–ఆర్డినేటర్స్ కె.శోభావతి, జె.శారదమూర్తి, మోహన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ క్యాంప్‌లో 170 మందికి రక్త పరీక్షలు, 160మందికి చర్మ పరీక్షలు, 145 మందికి దంత పరీక్షలు, 150 మందికి కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా 12మంది అధ్యాపకులు, విద్యార్థులు రక్తదానం చేశారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ప్రోగ్రామింగ్ అధికారులు డాక్టర్ ఓ.పద్మజ, డాక్టర్ ఎల్.మహేష్, జి.మల్లికార్జున్, హెల్త్ క్లబ్ కన్వీనర్ నీరజ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆరాధన సంగీతోత్సవాలు

నల్లకుంట: న్యూ నల్లకుంటలోని న్యూరామాలయం ప్రాంగణంలో త్యాగరాజస్వామి వార్షిక ఆరాధన సంగీతోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం సాయంత్రం కొమ్ము దక్షిణామూర్తి, శివచందర్ శ్రీదేవి దంపతుల సౌజన్యంతో ప్రత్యేక సంగీత కచేరి నిర్వహించారు. రామరాజు దినకర్ శిష్య బృందం గానం, వాయిద్య కచేరి మంత్రముగ్దులను చేసింది. అనంతరం రామరాజు దినకర్ వయోలిన్ కచేరి ప్రేక్షకులను అలరించాయి. దీనికి మృదంగంపై వెంకటేష్, రాజగోపాలచారి, ఘటంపై టీపీ. బాలసుబ్రమణ్యం వాద్య సహకారం అందించారు.

అందుబాటులోకి వచ్చేస్తోంది!

అంబర్‌పేట ఫ్లైఓవర్

- ఏడేళ్లుగా సాగిన నిర్మాణం ఎట్టకేలకు పూర్తి
- మూడు పార్టీల ప్రజాప్రతినిధులకు ఆహ్వానించనున్న అధికారులు
- వారందరి సమయం కోసం అధికారులు కసరత్తు
- వెంటనే ప్రారంభించాలని ప్రజల డిమాండ్
- ఫ్లైఓవర్ కింది రోడ్డును తక్షణమే పూర్తి చేయాలి





అధ్వానంగా ఫ్లైఓవర్ కింది రోడ్డు

అంబర్‌పేట: అంబర్‌పేట ఫ్లైఓవర్ ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యింది. నిర్మాణంలో ఏళ్ల తరబడి జరిగిన జాప్యానికి ఎట్టకేలకు తెరపడనుంది. ఫ్లైఓవర్ పనులు పూర్తి కాగా కింద రోడ్డు పనులను కొంత మేరకు పెండింగ్ పనులు ఉండటంతో వాటిని సహితం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నారు. అంబర్‌పేట మీదుగా వెళ్తున్న వరంగల్ జాతీయ రహదారిపై ఏడేళ్ల క్రితం కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చేతులు మీదుగా ప్రారంభించిన ఫ్లైఓవర్ పనులు పూర్తయ్యాయి. ఇక్కడి ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే, అంబర్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, రామంతాపూర్, వరంగల్ వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు తొలగనున్నాయి.

1.65 కిలో మీటర్ మేరా...

◆ అంబర్‌పేటలో గోల్నాక చర్చ్ నుంచి 6 నంబర్ చౌరస్తా, శ్రీరమణ చౌరస్తా మీదుగా ముఖరం హోటల్ వరకు ఫ్లైఓవర్ నిర్మాణం జరిగింది. దీని కోసం 282 ఆస్తుల సేకరణ జరిగింది. ప్రారంభ అంచనాలకు మించి రూ. 445 కోట్ల వ్యయంతో నిర్మించారు. నిర్మాణం పూర్తవడంతో అంబర్‌పేటవాసులు ఎప్పుడు అందుబాటులోకి తీసుకొస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు.

ప్రజాప్రతినిధుల సమయం ఇస్తే..

◆ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం అధికార యంత్రాంగానికి సవాల్‌గా మారునుందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో బీజేపీ ఎమ్మెల్యేగా ఉన్న కిషన్‌రెడ్డి ఫ్లైఓవర్ ప్రతిపాదనలు తీసుకొచ్చి మంజూరుకు చొరవ తీసుకున్నారు. అలాగే ఫ్లైఓవర్ పనులను పర్యవేక్షించి ముందుకు సాగేలా ప్రస్తుత బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటంతో సంబంధిత మంత్రుల సమయం తీసుకోవాల్సి ఉంటుంది. మూడు పార్టీల ప్రజాప్రతినిధులకు ఫ్లైఓవర్ ప్రారంభానికి ముడిపడి ఉండటంతో ఎప్పుడు ప్రారంభిస్తారా? అని పలువురు వ్యాఖ్యనిస్తున్నారు. రాజకీయ బేషజాలకు పోకుండా వీలైనంత త్వరగా ప్రజలకు ఫ్లైఓవర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యగా మారిన సర్వీస్ రోడ్డు..

◆ ఫ్లైఓవర్ నిర్మాణం జరిగిన ప్రాంతంలో కింద ఉన్న సర్వీస్ రోడ్ సమస్యల మయంగా మారింది. ఫ్లైఓవర్ కోసం చేసిన రోడ్డు విస్తరణ తాజాగా కొన్ని చోట్ల తిరిగి కబ్జాకు గురైంది. అలాగే ఫ్లైఓవర్ కింది నుంచి డ్రైనేజీ, తాగునీరు, పైపులైన్లతో పాటు వర్షపునీరు వెళ్లే నాలాల నిర్మాణం ఇంకా కొనసాగుతోంది. ఉన్న సర్వీస్ రోడ్ అధ్వానంగా ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆధునిక చిత్ర కళకు మార్గదర్శి దామెర్ల రామారావు



మాట్లాడుతున్న ఆచార్య కొలకలూరి ఇనాక్. చిత్రంలో జనార్దనామూర్తి,సత్యనారాయణమూర్తి

చిక్కడపల్లి: తెలుగు ప్రాంతాలలో ఆధునిక చిత్ర కళకు మార్గదర్శి దామెర్ల రామారావు అని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. మంగళవారం త్యాగరాయ గానసభలో జరిగిన దామెర్ల రామారావు యాదిలో.. సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి వారు నివాళులర్పించారు. అనంతరం ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ.. రాజమండ్రిలో జన్మించిన దామెర్ల చిత్ర కళలో తనదైన ముద్ర వేశారన్నారు. ప్రాశ్చాత్య చిత్ర కళకు ప్రాంతీయతను మిళితం చేశారని చెప్పారు. ఆయ చిత్రకళలో కార్తీక పౌర్ణమి, తూర్పు కనుమల గోదావరి వంటి చిత్రాలు ప్రసిద్ధమైనవి తెలిపారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి మాట్లాడుతూ.. రాజమండ్రిలో దామెర్ల చిత్రకళ ప్రదర్శనశాలను మహాత్మా గాంధీ ప్రారంభించడం విశేషమని అన్నారు. సభలో సంఘ సేవకుడు సత్యనారాయణ మూర్తి, గాయకుడు కె.శివకుమార్, గాయని మల్లాది ఉష పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించడం అభినందనీయం

- తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ
- వి.హనుమంతరావును అభినందించిన దీపాదాస్



రాజీవ్‌గాంధీ స్మారక అండర్-19 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న దీపాదాస్ మున్షీ

అంబర్‌పేట: క్రీడలు ప్రాంతాలు, కుల మతాల మధ్య స్నేహ పూర్వక వాతావరణానికి దోహదపడతాయని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ అన్నారు. మంగళవారం అంబర్‌పేటలోని జలమండలి క్రికెట్ గ్రౌండ్‌లో రాజీవ్‌గాంధీ 18వ స్మారక అండర్–19 డే అండ్ నైట్ టీ–20 లీగ్ క్రికెట్ చాంపియన్‌షిప్–2025 పోటీలు ప్రారంభమయ్యాయి. క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ పోటీలను దీపాదాస్ మున్షీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇలాంటి క్రికెట్ టోర్నమెంట్‌లు ప్రతిభా ఉన్న పేద క్రీడకారులకు ఎంతో దోహదపడతాయని అన్నారు. వీహెచ్ ఇలాంటి టోర్నమెంట్‌లు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు రాష్ట్ర ఎమ్మెల్యే జేఏ హసన్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కమలాకర్‌రావు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శులు ఆర్.లక్ష్మణ్ యాదవ్, బొల్లు కిషన్, క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ శంభూల శ్రీకాంత్‌గౌడ్, హైదరాబాద్ అధ్యక్షులు ఆది అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

సబర్మతినగర్‌లో కమ్యూనిటీహాల్ ఏర్పాటుకు కృషి చేస్తా



కమ్యూనిటీహాల్ నిర్మించాలని కార్పొరేటర్ పావనికి వినతిపత్రం సమర్పిస్తున్న బస్తీ వాసులు

చిక్కడపల్లి: సబర్మతినగర్‌లోని ప్రభుత్వ ఖాళీ స్థలంలో బస్తీవాసుల సౌకర్యార్థం కమ్యూనిటీహాల్ నిర్మాణానికి కృషి చేస్తానని గాంధీనగర్ కార్పొరేటర్ పావని అన్నారు. సబర్మతినగర్ వాసులు మంగళవారం కార్పొరేటర్ కార్యాలయంలో ఆమెను కలసి వినతిపత్రం అందజేశారు. అశోక్‌నగర్ నాలా విస్తరణ, నాలా రిటర్నింగ్ వాల్ నిర్మాణ సమయంలో ఇరిగేషన్ అధికారులు కమ్యూనిటీహాల్‌ను కూల్చివేశారని ఆమెకు తెలిపారు. ప్రస్తుతం అదే స్థలంలో కమ్యూనిటీహాల్ నిర్మించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో చర్చించి కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, బస్తీ నాయకులు కె.నర్సింగ్‌రావు, జి.నర్సింగ్‌రావు, ఎండీ గౌస్, వై.లక్ష్మయ్య, ఎం.ఉమేష్, డి.కుమార్ టి.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

పెన్షనబుల్ సాలరీ సీలింగ్‌ను రూ.26వేలకు పెంచాలని డిమాండ్



బర్కత్‌పురలోని ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నేతలు

కాచిగూడ: దీర్ఘకాలికంగా, అపరిష్కృతంగా ఉన్న కార్మికులు, పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. మంగళవారం బర్కత్‌పురలోని ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ... పీఎఫ్, దాని అనుబంధ స్కీమ్‌ల అమలులో తలెత్తుతున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల కేవైసీ సత్వరమే పూర్తి చేసి సహకరించాలన్నారు. అనవసరమైన కారణాలతో రిజెక్ట్ చేయెుద్దన్నారు. పెన్షనబుల్ సాలరీ సీలింగ్‌ను రూ.26వేలకు పెంచాలని కోరారు. హయ్యర్ పెన్షన్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

◆ కోర్టు తీర్పు ప్రకారం జాయింట్ డిక్లరేషన్ ఇచ్చిన వారికి తక్షణమే డిమాండ్ నోటీసులు జారీ చేయాలన్నారు. డిమాండ్ నోటీసులకు డబ్బులు చెల్లించిన వారికి తక్షణమే సవరించిన పెన్షన్‌ను చెల్లించాలని కోరారు. సవరించిన పెన్షన్ చెల్లిస్తున్న వారికి రావాల్సిన ఎరియర్స్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. హయ్యర్ పెన్షన్ చెల్లింపులో దామాషా పద్ధతిన కాకుండా చట్టప్రకారం పూర్తి పెన్షన్‌ను చెల్లించాలని కోరారు. కనీస పెన్షన్ రూ.9వేలకు పెంచాలన్నారు. ఈపీఎఫ్ పెన్షన్‌కు కరువు భత్యం, వేతన ఒప్పందాలను లింక్ చేయాలన్నారు. ధర్నా అనంతరం సీఐటీయూ ప్రతినిధి బృందం రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ (పెన్షన్)ను కలిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వీఎస్ రావు, భూపాల్, జె.వెంకటేష్, కుమారస్వామి, పెన్షనర్స్ నేతలు మాదాని బ్రహ్మచారి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌ఘడ్‌లో నిర్మూలన యుద్ధం ఆపాలి

ముషీరాబాద్: వరుస ఎన్‌కౌంటర్స్ పేరుతో ఛత్తీస్‌ఘడ్‌లో ఆదివాసులు, ఉద్యమకారులను నిర్మూలించే యుద్ధాన్ని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. వందలాది మందిని వేటాడి చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిర్మూలన యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ఆదివాసులు, విప్లవ ఉద్యమకారులు ఈ దేశ మూలవాసులని దురాక్రమణదారులు కాదన్నారు. కార్పొరేట్ వర్గాల వనరుల దోపిడీకి మోదీ, అమిత్‌షా చేయిస్తున్న ఈ యుద్ధం ఫాసిస్టు యుద్ధం అని విమర్శించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... విద్యానగర్–కాచిగూడ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (50) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు బద్రుక - సీజీఆర్ ఒప్పందం



సీజీఆర్ సంస్థతో పర్యావరణ పరిరక్షణకు ఒప్పందం చేసుకుంటున్న శ్రీకిషన్ బద్రుక

కాచిగూడ: తెలంగాణ రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ కోసం వివిధ కార్యక్రమాల నిర్వహణకు బద్రుక విద్యాసంస్థలు, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ (సీజీఆర్) మధ్య అవగాహన ఒప్పందం మంగళవారం జరిగింది. కాచిగూడలోని బద్రుక విద్యాసంస్థల ప్రధాన కార్యాలయంలో సొసైటీ కార్యదర్శి శ్రీకిషన్ బద్రుక, బద్రుక ఐటీ టెక్నాలజీ ప్రిన్సిపల్ డాక్టర్ డీవీఎస్ఎస్ మూర్తి, కామర్స్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ బి.మోహన్‌కుమార్, సీజీఆర్ అధ్యక్షుడు లీలా లక్ష్మారెడ్డి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ అవగాహన ఒప్పందం మేరకు పర్యావరణ పరిరక్షణ, వ్యవసాయ రంగం, జీవావరణ శాస్త్రం, వ్యర్థ పదార్థాల నిర్వహణ, పర్యావరణ క్లబ్బుల ఏర్పాటు, సెమినార్ల నిర్వహణ తదితర కార్యక్రమాలు సంయుక్తంగా నిర్వహించనున్నారు.

◆ ఈ సందర్భంగా శ్రీకిషన్ బద్రుక మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు తమ విద్యాసంస్థలు కట్టుబడి ఉన్నాయని అన్నారు. సీజీఆర్‌తో కలిసి మరిన్ని కార్యక్రమాలను నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. బద్రుక విద్యాసంస్థల డైరెక్టర్ జనరల్ ప్రొ. ఎస్.అభిరామకృష్ణ, డాక్టర్ పి.వెంకటయ్య, సిజీఆర్ ఫౌండర్ కె.లక్ష్మారెడ్డి, సీఈవో జి.నారాయణరావు, హరిసర్వోత్తమ్, మదన్మోహన్, ఎస్.దామోదర్‌రెడ్డి, జేఎస్ఆర్ అన్నమయ్య, జీవీ మురళి, చెన్ను శివప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో కార్మికులకు ఆమోదయోగ్యమైన వేతన పెంపు



సమావేశంలో పాల్గొన్న మండలి కార్యదర్శి శ్యామ్‌సుందర్, సభ్యులు

రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్

చిక్కడపల్లి: కార్మికుల వేతనాల పెంపునకు ప్రభుత్వం అధ్యయనం చేస్తోందని రాష్ట్ర కనీస వేతన సలహామండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ అన్నారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని రాష్ట్ర కార్మికశాఖ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కనీస వేతన సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కోటి 25 లక్షల మంది మెరుగైన జీతాలు అందించడం కోసం ప్రత్యేక శ్రద్ధ వహించి ఈ బోర్డు ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిల శ్రీధర్‌బాబు ఆమోదంతో కార్మికులకు ఆమోదయోగ్యమైన వేతన పెంపు ఉంటుందన్నారు. కార్మికుల సంక్షేమంతో మెరుగైన ఉత్పత్తి సాధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలి కార్యదర్శి శ్యామ్‌సుందర్, సభ్యులు నరసింహారెడ్డి, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, యూసుఫ్, రాజుముదిరాజ్, మీలా జయదేవ్, బాసాని చంద్రప్రకాష్, ప్రత్యేక ఆహ్వానితులు ప్రొఫెసర్ సి.రవి, లేబర్ విభాగం నుంచి బసిరెడ్డి పాల్గొని పలు విషయాలపై చర్చించారు.

ట్రంప్ ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

మాస్ లైన్ ఆలిండియా కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ట్రంప్ ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా పోడాలని అందులో భాగంగా ప్రజలను చైతన్య వంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆలిండియా కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్ అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతి ముగింపు సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రదీప్ సింగ్ ఠాగూర్ మాట్లాడారు. రష్యా సోషలిస్ట్ నిర్మాత లెనిన్ వారసత్వాన్ని కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రపంచంలోనే మొట్టమొదటి సారి సోషలిజాన్ని నిర్మించిన గొప్ప వ్యక్తి లెనిన్ అని అన్నారు. నేటికీ ఆయన రచనలు భారతదేశానికి అనుసరించడానికి సరిపోతాయని చెప్పారు. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ కెనడా, మెక్సికోలతో పాటు ఇతర దేశాలను అమెరికాలో కలుపుకుంటానని అనడం ఫాసిజానికి నిదర్శనమని అన్నారు.

◆ వీక్షణం ఎడిటర్ ఎన్ వేణుగోపాల్ మాట్లాడుతూ... వేలాదిగా రచనలు చేసి అనేక ఏళ్లు జైలు జీవితాన్ని గడిపిన లెనిన్ పోరాటం ఆదర్శనీయమని అన్నారు. సంపద సృష్టిదారులు పెట్టుబడిదారు లేనని విమర్శించారు. శ్రామికుల సంపదను కొల్లగొడుతూ అదనపు శ్రమను కూడా దోచుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాస్‌లైన్ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కెచ్చల రంగయ్య, కె.రమ, కేజీ రామచందర్, వి.కృష్ణ, ఎస్ఎల్ పద్మ, ఎం.కృష్ణ, కె.సూర్యం, మాస్‌లైన్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం.అన్వేష్, సోషలిస్ట్ నాయకులు జి. భార్గవ, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, భాస్కర్‌రావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలి





మహాధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ మిడియం బాబూరావు, పాల్గొన్న ఆదివాసీలు

కవాడిగూడ: తెలంగాణ వ్యాప్తంగా ఆదివాసీలు, గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇచ్చేందుకు ప్రభుత్వం రూట్ మ్యాప్ ప్రకటించి, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎంపీ, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిడియం బాబూరావు డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ ఆదివాసీ, గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూసం సచిన్ అధ్యక్షతన మహాధర్నా చేపట్టారు.

ప్రతి ఎకరానికి హక్కు పత్రం ఇవ్వాలి..

◆ ఈ సందర్భంగా మాజీ ఎంపీ మిడియం బాబూరావు మాట్లాడుతూ... ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలో దశాబ్దాల నుంచి నివాసం ఉంటున్న ఎస్టీ కోయ ఆదివాసీ షెడ్యూల్ తెగలకు చెందిన గుత్తికోయ, వలస ఆదివాసీలకు కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఆదివాసీలు చేస్తున్న ప్రతి ఎకరానికి హక్కు పత్రం ఇవ్వాలన్నారు.

ఆదివాసీ సమస్యలు ఎజెండాగా పెట్టి చర్చించాలి..

◆ ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం గిరిజన సలహా మండలి (టీఏసీ) సమావేశాలు, జిల్లా స్థాయిలో ఐటీడీఏ పాలక మండలి సమావేశాలు నిర్వహించి ఆదివాసీ సమస్యలు ఎజెండాగా పెట్టి చర్చించాలన్నారు. ప్రతి సమావేశంలో వీటి అమలు కోసం తీసుకున్న చర్యల నివేదిక (ఏటీఆర్) ఆధారంగా చర్చించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాలలో ఆదివాసీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలన్నారు.

ఆకు సేకరణ జరిగేలా టెండర్లు పిలవాలి..

◆ తునికి ఆకు లభ్యమయ్యే అన్ని యూనిట్లలో ఆకు సేకరణ జరిగేలా టెండర్లు పిలవాలన్నారు. తునికి ఆకు కార్మికులకు అటవీశాఖ నుంచి రావాల్సిన బోనస్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్‌లో అవకతవకలు జరుగుతున్నందున నగదు రూపంలో గ్రామ సభలలో డబ్బులు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నకిలీ కుల ధ్రువీకరణ, ఏజెన్సీ ధ్రువీకరణ పత్రాలపై ఐటీడీఏల ద్వారా విచారణ చేపట్టి నకిలీ ధ్రువపత్రాలు జారీ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇప్పటి వరకు ఆదివాసీ రైతులకు రుణమాఫీ లేదు..

◆ ఆదివాసీ రైతులకు రైతు రుణమాఫీ ఇప్పటి వరకు అందలేదని దానికి కారణాలను గుర్తించి ఆదివాసీలకు న్యాయం చేయాలన్నారు. జీవో నం.3 పునరుద్ధరణ కోసం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. 50శాతానికి పైగా ఆదివాసీ జనాభా ఉన్న గ్రామాలను షెడ్యూల్డ్ గ్రామాలుగా గుర్తించి 5వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు.

ఏజెన్సీ ప్రాంతాలలో కళాశాలలు, స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేయాలి..

◆ ఏజెన్సీ ప్రాంతాలలో నియోజకవర్గ కేంద్రాలుగా నర్సింగ్ కళాశాలలు, డీఎడ్ కళాశాలలు, స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఉట్నూరు, భద్రాచలం బీఈడీ కళాశాలతో సహా అన్ని విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, తెలంగాణ రైతు సంఘం సహాయ కార్యదర్శి శోభానాయక్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఉపాధ్యక్షులు బండారు రవికుమార్, లంకా రాఘవులు, ఏరామ పున్నం, ఆత్రం తనూష్, కారం పుల్లయ్య, తొడసం శంభూ, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.